క్లుప్తంగా

300 పశువులకు టీకాలు



చాకరాపల్లిలో పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ గణేష్

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి గ్రామంలో 300పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పశువులకు గాలి కుంటు వ్యాధి సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేర చేపట్టినట్లు గణేష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.మోహనరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'గడప గడపకు' పనులు వేగవంతం చేయాలి



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుమూర్తి

బలిజిపేట: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటాయించిన నిధుల ప్రాప్తికి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేయడం, త్వరితగతిన వాటిని పూర్తిచేయించడం మీ బాధ్యత అని స్పష్టం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయాల పరిధిలో పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ అంబేడ్కర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

27న కొత్తవలసలో గడప గడపకు...

సాలూరు: మండలంలోని కొత్తవలస పంచాయతీలో ఈ నెల 27న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

జాతీయ ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక




కొప్పరపు ప్రశాంత్‌కుమార్, జామి జ్యోతి స్వరూప్

మక్కువ: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌ఎంఎంఎస్‌కు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) ములక్కాయవలస, మక్కువకు చెందిన విద్యార్థులు కొప్పరపు ప్రశాంత్‌కుమార్, జామి జ్యోతిస్వరూప్ ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు క్రీడాకారుల ర్యాలీ

పార్వతీపురం టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం క్రీడాకారులతో ర్యాలీ నిర్వహిస్తామని క్రీడల చీఫ్‌కోచ్ ఎస్ వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీచేశారు. ర్యాలీ ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న మహిళలను అతిథులు సత్కరిస్తారని తెలిపారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి



మాట్లాడుతున్న శిక్షకులు

సాలూరు: గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్నామని ఎన్‌ఓజీ ఫైర్ అకడమిక్ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ మణిబాబు, అకడమిక్ కన్సల్టెంట్ శివశంకర్ అన్నారు. మాతృ భాషాధారిత బహుభాష విద్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉపాధ్యాయులకు పట్టణంలోని వైటీసీలో నిర్వహించిన శిక్షణ సమావేశంలో వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆదివాసీ మాతృ భాషపై పట్టు సాధించి.. తద్వారా ఈ ప్రాంతంలో విద్యాప్రమాణాలు మెరుగుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జీపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రబీ వరి సాగులో జాగ్రత్తలు చేపట్టాలి



బుడ్డిపేటలో వరినాట్లు వేస్తున్న రైతులు

సీతానగరం: రబీసీజన్‌లో మండలంలో రైతులు ప్రారంభించిన సాగులో పద్ధతులపై ముందునుంచే జాగ్రత్తలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని బుడ్డిపేట, వెంకటాపురం గ్రామాల్లో దమ్ము చేసిన భూముల్లో వరినాట్లు వేయడంపై పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని దయానిధిపురం,జానుమల్లువలస, లక్ష్మీపురం, వెంకటాపురం,కొత్తవలస, తామరఖండి, చినభోగిలి, బూర్జ, గెడ్డలుప్పి తదితర గ్రామాల్లో రబీ పంటలు 4,270 ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలియజేశారు. అందులో వరి 380 ఎకరాలలో సాగు చేస్తున్నారన్నారు. 3,990 ఎకరాల్లో అపరాల పంటలు సాగు చేస్తున్నారని వివరించారు. ఆరుతడి పంటలుగా మట్టి నమూనాలు చేసిన భూముల్లో పెసర, మినుము, జొన్న, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారన్నారు. తాజాగా అకాల వర్షాలు కురవడంతో మట్టి నమూనాలు చేసిన భూముల్లో వేసవి నువ్వు పంట సాగుకు రైతులు ఉపక్రమించారని తెలియజేశారు. రబీ వరి సాగు చేస్తున్న భూముల్లో వేయడానికి ఎరువుల కొరత లేదని, ఎరువుల వాడకంపై రైతులు అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఎకరా విస్తీర్ణంలో 30 కేజీల యూరియా,15 కేజీల పొటాష్ వేయాలని లేదా గ్రోమోర్ 20-20-0-13 ఎరువును వేయాలని సూచించారు. అలాగే కలుపు నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. త్వరలో డాక్టర్ వైఎస్ఆర్ పొలం బడి కార్యక్రమాలు నిర్వహించడానికి సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలియ జేశారు.

వేగవంతంగా పశువులకు వ్యాక్సిన్



గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

సీతానగరం: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేగవంతం చేయాలని సీతానగరం పశుసంవర్ధక శాఖ సబ్‌డివిజన్ ఎ.డి సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈమేరకు శుక్రవారం బలిజిపేట,సీతానగరం మండలాల్లో జరుగుతున్న గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెలాఖరులోగా తెల్ల, నల్ల పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ మండల పశువైద్యాధికారుల పర్యవేక్షణలో పశువైద్య సిబ్బంది సీతానగరం మండలంలోని 5,988 పశువులకు, బలిజిపేటలో 9,941 పశువులకు టీకాలు వేశారన్నారు. నెలాఖరులోగా మిగతా పశువులకు కూడా వాక్సిన్ వేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా గ్రామకంఠం సర్వే



మాట్లాడుతున్న ఈఓపీఆర్‌ఆర్డీ కె. కుమారవర్మ

సీతానగరం: మండలంలో స్వమిత్వ పథకం ద్వారా గ్రామకంఠం భూముల సర్వే పంచాయతీకార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ కోరారు. ఈ మేరకు శుక్రవారం బగ్గందొరవలసలో ఇంజినీరింగ్, పంచాయతీ శాఖల సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న స్వమిత్వ గ్రామకంఠం సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భూముల రీసర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో గ్రామకంఠం విస్తీర్ణం, నిర్మించిన ఇళ్లు, నిర్మాణాల్లో ఉన్న ఇళ్లు, పరిశ్రమల భవనాల వివరాలను సేకరించడానికి ఇంజినీరింగ్ సహాయకుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు సత్వర చర్యలు తీసుకుని రీ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకూ నీలకంఠాపురం, పాపమ్మ వలస,కొత్తవలస, గంగరాజపురం, చిన్నారాయుడుపేట, జగన్నాథపురం, బగ్గందొరవలస గ్రామాలకు సంబంధించిన రీ సర్వే ప్రక్రియ పూర్తి కావచ్చిందన్నారు.రీ సర్వే జరిగిన గ్రామాల్లో కొలతలను వేసి రికార్డింగ్ చేస్తారని చెప్పారు. గ్రామాల్లో రీ సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించి వారికి అవసరమైన సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సహాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చింతపండు కొనుగోలు లక్ష్యాలు అధిగమించాలి

- జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్



సీసీపీపలకు సూచనలిస్తున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: చింతపండు కొనుగోలు లక్ష్యాలను అధిగమించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ కార్యాలయంలో సీసీపీపలతో శుక్రవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాణ్యతతో కూడిన చింతపండును మాత్రమే కొనుగోలు చేయాలని, అమ్మకాలు చేపట్టిన తక్షణమే నగదును చెల్లించాలంటూ పలు సూచనలు చేశారు.

చింతపండు తడపొద్దు

బరువు ఎక్కువ అవుతుందన్న ఆశతో చింతపండును తడపటం వల్ల తిరిగి నష్టమే కలుగుతుందన్న సత్యాన్ని గ్రహించాలని జీసీసీ డీఎం మహేంద్రకుమార్ గిరిజనులను కోరారు. జీసీఎంఎస్ కార్యాలయంలో డీఎం విలేకర్లతో మాట్లాడారు. జీసీసీ ద్వారా చింతపండు కిలోను రూ.32.40లకు కొనుగోలు చేస్తుండగా బయట వ్యాపారులు కిలో చింతపండును రూ.22 నుంచి రూ.24కు కొనుగోలు చేస్తున్నారని, జీసీసీకి, బయటి వ్యాపారులకు మధ్య కొనుగోలులో వ్యత్యాసం రూ.8లకు పైగా ఉందన్నారు. తడిసిన/తడిపిన చింతపండును వ్యాపారులకు ఇచ్చి తక్కువ ధరను పొంది నష్టపోకుండా చింతపండు తడపకుండా/తడిసిపోకుండా జాగ్రత్తగా సేకరించి జీసీసీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ఆదాయం పొందాలని గిరిజనులకు సూచించారు. డివిజనల్ పరిధిలో ఈ సీజన్లో 11,300 క్వింటాళ్ల చింతపండును కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా చేసుకోగా ఇప్పటి వరకు 1400 క్వింటాళ్ల చింతపండును మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. వర్షాలు విపరీతంగా కురుస్తుండటం, తడిసిపోయి నాణ్యత లేని చింతపండును తీసుకొస్తుండటం వలన కొనుగోలు మందకొడిగా సాగుతోందన్నారు.

ఏప్రిల్ 6 నుంచి పూర్తిస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం



ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి ఐశ్వర్య

పార్వతీపురం టౌన్: ఏప్రిల్ 6వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం అములులోకి వస్తుందని వైద్యాధికారిణి ఐశ్వర్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని డోకిశీల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ ద్వారా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వేలం పాట ఆదాయం రూ.7.25 లక్షలు



వేలంపాటలో పాల్గొన్న స్థానికులు

వీరఘట్టం: మేజరు పంచాయతీలోని అంబేడ్కర్ జంక్షన్‌తో పాటు కొత్త బస్టాండ్‌లో ఉన్న పంచాయతీ షాపులు, ప్లాట్లుకు అద్దె ప్రాతిపదికన శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ.7.25 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈఓ వి.రామచంద్రరావు తెలిపారు. కొత్త బస్టాండ్‌లో ఉన్న ఎనిమిది షాపుల్లో ఐదు షాపులను రూ.1.19 లక్షలకు వేలం పాడగా ఇంకా నాలుగు షాపులను పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నారు. మొత్తం పంచాయతీకి రూ.7,25,500లు ఆదాయం వచ్చిందని తెలిపారు. సర్పంచ్ పులిటి గౌరమ్మ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు.

మంచి వైద్య సేవలు అందించాలి



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

బలిజిపేట: రోగులకు మంచి వైద్యసేవలు అందించాలని ఎంపీపీ నాగమణి కోరారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి మహీపాల్ ఆధ్వర్యంలో అభివృద్ధి నిధుల కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి వచ్చిన నిధుల ఖర్చులకు సంబంధించి కమిటీ ఆమోదం కోసం సమావేశం నిర్వహించారు. గతంలో వచ్చిన రూ.1.50లక్షల వినియోగంతో కొనుగోలు చేసిన పరికరాలను వైద్యాధికారి మహీపాల్ కమిటీ సభ్యులకు చూపించారు. తాజాగా వచ్చిన రూ.25వేలతో వైద్య పరీక్షలకు సంబంధించిన చిన్నచిన్న కిట్లు, స్టేషనరీ, మినరల్ వాటర్‌కు సంబంధించిన పరికరాలు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. దీనికి కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీడీఓ భానుమూర్తి, సీహెచ్‌ఓ వెంకటరమణ, శివరాంపురం సర్పంచ్ శ్రీనివాసరావు, కె.వెంకటరమణ, జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసింహాలతో ఆందోళన



బలిజిపేటలో సంచరిస్తున్న కుక్కలు

బలిజిపేట: మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువగా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా వీధి కుక్కల సంఖ్య పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాలలో ఇటీవల జరుగుతున్న సంఘటనలతో బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో మాంసాలు విక్రయించే షాపుల వద్ద పారవేసిన ముక్కలను అలవాటుపడిన కుక్కలు మనుషులమీదకు ఉరికి గాయాల పాలు చేస్తాయని, ఇలా అయితే ఎలా ధైర్యంగా ఉండగలమని ప్రశ్నిస్తున్నారు. గ్రామాలలో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయని ఆసమయంలో ఎవరైనా ఎదురుపడితే వారిపై పడి గాయాలకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేకలు, గొర్రెలు ఉండే శాలలలోకి దూరి దాడిచేస్తున్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద తప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి



పెదపెంకిలో ప్రచారం చేస్తున్న కార్మికులు

బలిజిపేట: వచ్చేనెల 5వ తేదీన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నారాయణపురం, పెదపెంకి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రభుత్వం..కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని వాటి పరిష్కార నిమిత్తం పోరాడాల్సి ఉన్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, వి.సత్యం నాయుడు, ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం

- ఏఈ సోమేశ్వరరావు



పెదభోగిలిలో జరుగుతున్న విద్యుదీకరణ పనులు

సీతానగరం: మండలంలోని లబ్ధిదారులు గృహప్రవేశాలకు సిద్ధం చేస్తున్న జగనన్న కాలనీల్లోని ఇళ్లకు విద్యుద్ధీకరణ పనులు వేగవంతం చేస్తున్నామని ఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పెదభోగిలి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగుగ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న విద్యుద్ధీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 53 జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కారణంగా లబ్ధిదారులు గృహప్రవేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నందున వీధిలైట్లు, ఇళ్ల సర్వీసులు, సామాజిక పంచినీటి పథకం మోటార్లకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా గృహప్రవేశాలు నిర్వహించడానికి గృహనిర్మాణ శాఖ సిద్ధం చేయడంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించే కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులతో పాటు విద్యుద్ధీకరణ పనులు చురుగా జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

సూక్ష్మ ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

పాచిపెంట: సూక్ష్మ ప్రణాళికతోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని నీడ్ సంస్థ ప్రతినిధి పాచిపెంట వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని విశ్వనాథపురంలో సర్పంచ్ గొర్లె సత్యవతి అధ్యక్షతన నీడ్ సంస్థ ఆధ్వర్యంలో సూక్ష్మప్రణాళికల తయారీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ, రైతులు ముందస్తు ప్రణాళికలు తయారుచేసుకుని వ్యవసాయం చేసుకోవాలన్నారు. పెద్దగెడ్డ జేఈ జి. సంధ్య మాట్లాడుతూ, జలాశయం ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని ఈ ఖరీఫ్‌కు సాగునీరు అందించే పరిస్థితి ఉండదన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తోకల లక్ష్మి, వ్యవసాయ శాఖ ఎ.డి మధుసూదనరావు, తదితరలు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న బోర్ల సామగ్రి



మండలానికి చేరిన బోర్ల సామగ్రి

గరుగుబిల్లి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు బోర్ల సామగ్రిని అందుబాటులోకి అధికారులు తెచ్చారు. గ్రామ పంచాయతీలో ఏటా వేసవిలో బోర్లు మరమ్మతులు నిర్వహించేందుకు క్రాష్ ప్రోగ్రాన్ని నిర్వహించేవారు. ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా బోర్లకు మరమ్మతులను నిర్వహించేందుకు సామగ్రిని రప్పించారు. 25 పంచాయతీల్లో మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి అవసరమైన సామగ్రిని అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ పైడితల్లి తెలిపారు. బోర్లు మరమ్మతులకు గురైతే తక్షణం సమాచారాన్ని కార్యాలయానికి అందించాలన్నారు.

ఆదాయ మార్గాల పెంపునకు కృషి



చెత్త సంపద కేంద్రంలో మొక్కకు నీరు పోస్తున్న డీపీఓ సత్యనారాయణ

గరుగుబిల్లి:

పంచాయతీల్లో ఆదాయ మార్గాలను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని సుంకి పంచాయతీలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడంతో పాటు వీధి దీపాలను నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలను సక్రమంగా నిర్వహించి సేంద్రీయ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్ కె.రవీంద్ర తదితరులు ఉన్నారు.

శాశ్వత ప్రాతిపదికన రైతులకు భూములు

- రీ సర్వే సంకల్పం అదే ..
- తహసీల్దార్ ఎన్వీ రమణ



ఏగోటివలస గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలో భూములు రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బందికి రైతులంతా సహకరించి వారి భూముల లెక్కల దఖలును భద్ర పరుచుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏగోటివలస గ్రామంలో రీ సర్వే డీటీ చిట్టెమ్మ ఆధ్వర్యంలో రీ సర్వే విధానంపై రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం భూముల 'రీ'సర్వే జరిగిందని ఇంతవరకూ 'రీ' సర్వే చేయకపోవడంతో సాంకేతిక పరంగా రైతులు భూముల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం అసలైన రైతులకు భూములు చెందాలనే సంకల్పంతో రీ సర్వే ప్రక్రియను 2019లో ప్రారంభించిన సమయంలో కోవిడ్ మహమ్మారి రావడం, విధులు స్తంభించిపోవడం వల్ల ఇబ్బందులు వచ్చినట్లు వివరించారు. రైతులు సాగుచేస్తున్న భూములకు సంబంధించిన హక్కులు అదేరైతుల పేరున లేవని తెలియడంతో భూ తగాదాలు పేరుకుపోతున్నట్లు గుర్తించి భూముల స్థిరీకరణకు రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత జగనన్న భూ హక్కు భూరక్ష పథకం ద్వారా రీ సర్వే పనులు ప్రారంభించారని తెలియజేశారు.

చురుగ్గా రీ సర్వే పనులు

ఆరు నెలలుగా రీ సర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. తాజాగా భూములకు ధరలు పెరగడం వల్ల రైతులు, ప్రభుత్వానికి చెందిన భూముల్లో ప్రతి సెంటును కాపాడాల్సిన భాద్యత రెవెన్యూ, సర్వే శాఖలపై ఉందన్నారు. అందుకు ప్రజలు, రైతుల సహకారం అవసరమని కోరారు. ఈ మేరకు గ్రామాల్లో రైతుల సహకారంతో ఇంతవరకూ డ్రోన్ సర్వేపూర్తయిందన్నారు. గ్రౌత్ లెవెల్‌లో రోవర్ సహాయంతో సర్వే పనులు మూడో విడత గ్రామాల్లో ప్రారంభించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో రైతులకు జగనన్న భూ హక్కు- భూ రక్ష పట్టాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో రీసర్వే పనులకు వస్తున్న సర్వే,రెవెన్యూ అధికార సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకరరావు, సచివాలయం సర్వేయర్ సీహెచ్ శంకరరావు, సర్పంచ్ రాధాకృష్ణ, వీర్వో, రైతులు పాల్గొన్నారు.